క్లుప్తంగా

కానుకమాత చర్చిలో బైబిల్ క్విజ్ పోటీలు



రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి ఆవరణలోని ఆడిటోరియంలో మంగళవారం చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి ఆధ్వర్యంలో మరియదళ సభ్యులకు బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం రేజియా సంస్థ ఆదేశాల మేరకు మరియదళ సభ్యులు(జపమాల మాత, లూర్దుమాత, ఆరోగ్యమాత, కానుకమాత, నిర్మలమాత) సభలకు చెందిన సుమారు 50 మందికి బైబిల్‌లోని మత్తయిసువార్తపై క్విజ్ పోటీలను నిర్వహించినట్లు చర్చి సహాయ గురువులు రె.ఫాదర్ ప్రసన్నకుమార్ వెల్లడించారు.

మత్స్యకారులకు ఆహారం అందజేత



దాచేపల్లి: మత్స్యకారులకు సాగర్ సిమెంట్ యజమాన్యం మంగళవారం ఆహార పదార్థాలు సరఫరా చేసింది. కృష్ణానదిలో వరద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో మత్స్యకారుల కాలనీ నీట మునిగింది. దీంతో రామాపురంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రానికి మత్స్యకారులను తరలించారు. నాలుగు రోజుల నుంచి సాగర్ సిమెంట్స్ యజమాన్యం ఉచితంగా భోజన సదుపాయం కల్పించింది. మత్యకారులు ఇళ్లకు చేరుకునేంత వరకు తాము ఆహార పదార్థాలను ఉచితంగా సరఫరా చేస్తామని కంపెనీ ప్రతినిధులు చెప్పారు.

మహిళా సంఘాలకు రుణాల మంజూరుకు కృషి

శావల్యాపురం: ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాల అభ్యున్నతికి రుణాలు మంజూరు చేస్తున్నట్లు ఆ బ్యాంకు నరసరావుపేట రీజనల్ మేనేజరు పి.రవికుమార్ అన్నారు. మంగళవారం శావల్యాపురం బ్రాంచ్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 41 బ్యాంకు శాఖలు ఉండగా 10 వేల మహిళా గ్రూపులు ఉన్నాయని, మొదట విడతలో భాగంగా అర్హత కలిగిన 20 వేల మంది మహిళలకు యూనిట్ ఆధారంగా రూ. 2లక్షల నుంచి రూ. 10లక్షల వరకు తక్కువ వడ్డీతో రుణసదుపాయం కల్పించనున్నామన్నారు. ఇందులో భాగంగా రూ. 400 కోట్లు నిధులు కేటాయించామని ఈనెల 31లోగా అర్హులను గుర్తించి రుణాలు మంజూరు చేస్తామన్నారు. శావల్యాపురం బ్రాంచి మేనేజరు వలేటి ప్రసాదు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

శావల్యాపురం: శావల్యాపురం సొసైటీ పరిధిలో యూరియా నిల్వలు 39.6 మెట్రిక్ టన్నులు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు మంగళవారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు రైతులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి ప్రతి యొక్క రైతుకు యూరియా, డీఏపీ ఎరువులు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. డీటీ బి.సుబ్బారావు, వీఆర్వో రమాదేవి, సొసైటీ సీఈఓ జాలాది నాగప్రసాదు, రైతులు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



శావల్యాపురం: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి.సుగుణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ సంబంధం లేని పనులు చేయిస్తూ సచివాలయ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడటం సమంజసం కాదన్నారు. సచివాలయ ఉద్యోగులచే పింఛనుదారుల ఇంటికి వెళ్లి పింఛను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేయటం తగదన్నారు. ప్రత్యేక అవసరాల కల్గియున్న వారి ఇళ్లకే వెళ్ళి పింఛన్లు ఇస్తామని మిగిలివారందరు సచివాలయానికి వచ్చి తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

రేపు ఈఎన్‌టీ ఉచిత వైద్యశిబిరం

నరసరావుపేట: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రెండో తేదీ గురువారం గుంటూరురోడ్డులోని కొండవీడు ఈఎన్‌టీ హాస్పటల్‌లో ఉచిత చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన హాస్పిటల్‌లో విలేకర్లకు వివరాలు వెల్లడించారు. ఈ శిబిరంలో చెవి, ముక్కు, గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. వినికిడి లోపం ఉన్నవారికి ఉచితంగా పరీక్షలు చేస్తామని, ప్రతి డిజిటల్ ప్రోగ్రామబుల్ చెవిటి మిషన్‌పై 30శాతం రాయితీ, వర్టిగో (తల తిరుగుడు) పరీక్షపై 20శాతం రాయితీ ఇవ్వబడుతుందన్నారు.

డిజిటల్ బుక్‌తో ప్రతి కార్యకర్తకు న్యాయం

- అక్రమ వసూళ్లకు పాల్పడితే వడ్డీతో తిరిగి తీసుకుంటాం
- వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు దారుణం
- వేధింపులకు గురిచేసిన వారిని పాకిస్తాన్ పోయినా వదిలే ప్రసక్తే లేదు
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, యెనుముల మురళీధర్‌రెడ్డి తదితరులు

పిడుగురాళ్ల: డిజిటల్ బుక్, అన్యాయం జరిగిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి బాధ్యతలు చేపట్టిన వెంటనే న్యాయం చేసేందుకేనని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో మొట్టమొదటిసారి కార్యకర్తలకు న్యాయం చేయటం కోసం డిజిటల్ బుక్‌ను తీసుకొని రావటం జరిగిందని చెప్పారు. అన్యాయంగా కేసులు నమోదు కాబడిన వారందరూ ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చునని సూచించారు. వారికి జరిగిన అన్యాయాలను నోట్ చేస్తే మూడున్నర సంవత్సరాల తరువాత ముఖ్యమంత్రి కాగానే ఎవరైతే అన్యాయం చేశారో టీడీపీ కార్యకర్త, నాయకులైనా, అధికారులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు

పల్నాడు ప్రాంతంలోని సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు అన్యాయమని కాసు చెప్పారు. జూలకల్లులో ఇప్పటికే నాలుగురిపై కాళ్లు విరిగేలా దాడి చేయగా, ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డిని చంపుతానని బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. పిన్నెల్లి, తురకపాలెం గ్రామాల నుంచి సుమారు 400 నుంచి 500 కుటుంబాల వరకు గ్రామాలను వదిలి వెళ్లిపోయారని వెల్లడించారు. తంగెడల్లో హరికృష్ణను కొట్టడం, సోషల్ మీడియా యాక్టివిస్టులు వెన్నా రాజశేఖర్‌రెడ్డి, షేక్ మాబు, ఇర్లా శివను కొట్టడమే కాకుండా కేసులు పెట్టడం జరిగిందని వివరించారు. తుమ్మలచెరువులో బెదిరించి డబ్బులు వసూలు చేశారని, ఎక్కడైతే దొంగ కేసులు అన్యాయంగా పెట్టారో, అన్యాయంగా ఒక కేసు పెడితే రేపు మూడు కేసులు వస్తాయని, మీరు డబ్బులు వసూలు చేస్తే వడ్డీతో సహా డబ్బులు వసూలు చేస్తామని హెచ్చరించారు. పాకిస్తాన్ పోయినా వదిలే ప్రసక్తి లేదని పేర్కొన్నారు.

మెడికల్ కాలేజీని నిర్మిస్తే....

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని సుమారు 60 నుంచి 70 శాతం పూర్తి చేశామని కాసు తెలిపారు. దాచేపల్లి, మాచర్ల, సాగర్ హైవేను తీసుకొని వస్తే, కొండమోడు, పేరేచర్ల హైవేను నాంది పలికామన్నారు. గురజాల, దాచేపల్లిని మున్సిపాలిటీ చేశామని, పిడుగురాళ్ల పట్టణంలో రోడ్డు వెడల్పు, బైపాస్ పూర్తి చేశామని వివరించారు. తాగునీటి పథకాలను తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాని దొంగ కేసులు పెట్టడం, పనులు చేయకుండా నోరు నొక్కుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

మున్సిపాలిటీకి చివరి ర్యాంకు..

రాష్ట్రంలో మొత్తం 125 మున్సిపాలిటీలుంటే పిడుగురాళ్ల చిట్టచివరి 110వ ర్యాకింగ్‌లో ఉందని, దాచేపల్లి 90వ ర్యాంక్‌లో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సిగ్గుతో తలదించుకోవాలని ఎద్దేవా చేశారు. గతం ప్రభుత్వం తీసుకొచ్చిన జానపాడు రైల్వే బ్రిడ్జి పనులు ఏడాది అయినా పనులు ఇంకా మొదలు పెట్టలేదని చెప్పారు. 'ఎంత సేపు చికెన్ అమ్ముకుందాం, చిప్స్ అమ్ముకుందాం, మైనింగ్ అమ్ముకుందాం, లిక్కర్ అమ్ముకుందాం' కానీ ఒక్క పెద్ద ప్రాజెక్టుని కూడా తీసుకొని రాలేదని విమర్శించారు. మూడున్నర ఏళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ వస్తుందని పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మున్సిపాలిటీలను లండన్ చేస్తామని చెప్పం కానీ ఉన్నతమైన పట్టణాలు తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు యెనుముల మురళీధర్‌రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు మాదాల కిరణ్‌కుమార్, చింతా సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, కేవీ, మాజీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, నాయకులు కొమెర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూటమి కుట్రలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలి

- వైఎస్సార్ సీపీ నాయకుల పిలుపు
- డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరణ



మండాదిలో డిజిటల్ యాప్ క్యూఆర్ ను ప్రారంభిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలపై కూటమి నేతలు చేస్తున్న అరాచకాలపై భవిష్యత్తులో డిజిటల్ బుక్ ద్వారా తగిన గుణపాఠం చెబుదామని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు తాడి వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండాదిలో వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనపై ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై అధికారుల వేధింపులకు దిగుతున్న నేపథ్యంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారని చెప్పారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేసిన ప్రతి ఒక్క కూటమి నాయకులను, కార్యకర్తలను గుర్తు పెట్టుకొని యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక ఇదేమని సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తుంటే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ యువజన ఉపాధ్యక్షులు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గం వ్యవసాయ విభాగం అధ్యక్షుడు సబ్బసాని కోటిరెడ్డి, కండ్లకుంట సొసైటీ మాజీ అధ్యక్షుడు తాడికొండ పుల్లారెడ్డి, మండాది సర్పంచి శీలం సైదారెడ్డి, కండ్లకుంట మాజీ సర్పంచి అమరయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఎదురూరి కృష్ణారెడ్డి, రామిరెడ్డి లింగారెడ్డి, చిన్నపరెడ్డి చిన మల్లారెడ్డి, మండాది ఎంపీటీసీ కాంతారావు, వెంకట నారాయణ, కోటిరెడ్డి, సాంబిరెడ్డి పాల్గొన్నారు.

పొందుగలకు నిలిచిన తాగునీటి సరఫరా

- వారం రోజులుగా అవస్థలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



దాచేపల్లి: మండలంలోని పొందుగల గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా తాగునీటిని సరఫరా నిలిచిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చుక్క తాగునీరు అందకపోవటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామానికి కృష్ణానది నుంచి పొందుగలకు తాగునీటిని మోటార్ ద్వారా సరఫరా చేస్తారు. అయితే వారం రోజులుగా కృష్ణానదిలో వరద నీటి ఉధృతి పెరగటం వలన మోటారు పని చేయటం లేదు. గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితులు వచ్చిన సందర్భంలో సర్పంచి ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా తాగునీటిని ప్రత్యామ్నయ మార్గాల ద్వారా అందించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటం వలన ప్రస్తుత సర్పంచిని పనిచేయకుండా అడ్డుకున్నారు. పంచాయతీలో కూటమి నేతలే అధికారులను అడ్డంపెట్టుకుని పెత్తనం చేస్తున్నారు. వారం రోజులుగా ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతుంటే అధికారులు, కూటమి నాయకులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో గ్రామస్తులు తాగునీటి కోసం పరుగులు తీయాల్సిన పరిస్థితి ఉంది.

పేకాట స్థావరంపై దాడి


నాదెండ్ల: పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం మధ్యా హ్నం దాడి చేశారు. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు నూతన బైపాస్ రోడ్డు కావూరు వెళ్లే అండర్ పాస్ సమీపంలో పేకాటాడుతున్న సమాచారంతో పోలీసులు దాడి చేశామన్నారు. ఏడుగు రు పేకాటాడుతుండగా, పోలీసులను చూసి తప్పించుకునే యత్నం చేశారు. నలుగురిని పట్టుకోగా, ముగ్గురు పరారయ్యారు. జూదరుల నుంచి రూ.5200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.




సత్రశాలలో కనకదుర్గాదేవి అలంకారం లో దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి




పాలువాయి జంక్షన్‌లో దుర్గాదేవి అలంకారంలో కనకదుర్గ అమ్మవారు



రెంటచింతలలో దుర్గాదేవి అలంకారంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు



రెంటచింతలలో చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మహాకాళీదేవి అలంకారం



దాచేపల్లి రెడ్లబజార్‌లో దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



నారాయణపురంలో దుర్గామాత అలంకరణలో అమ్మవారు



మొర్జంపాడు బుగ్గ మల్లేశ్వర స్వామి దేవాలయంలో దుర్గాదేవిగా అమ్మవారు



శిరిగిరిపాడు గ్రామ శివారులో దుర్గాదేవిగా కనకదుర్గమ్మ అమ్మవారు



పిడుగురాళ్ల... ప్రత్యేక అలంకారంలో గంగమ్మ తల్లి



పిడుగురాళ్ల... వెంకటేశ్వర స్వామి ఆలయంలో గజేంద్రుడిపై అమ్మవారి ప్రత్యేక అలంకరణ



పిడుగురాళ్ల... దుర్గాదేవిగా కనక దుర్గమ్మ



కారెంపూడిలో సరస్వతీ దేవి అలంకారంలో అంకాలమ్మ తల్లి

దుర్గాదేవిగా అమ్మవారు

రెంటచింతల: దసరా శరన్నవ రాత్రుల మహోత్సవంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో నున్న అమ్మవారి ఆలయాలలోని అమ్మవార్లు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. దేవస్థానం ఆవరణలలో రాత్రి 7 గంటల నుంచి నిర్వహించిన బతకమ్మ వేడుకలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దాచేపల్లి: దేవీశరన్నవరాత్రుల సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రెడ్లబజార్‌లోని అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరణ చేశారు. కుంకుమ పూజలతో పాటుగా శివలింగాలకు ప్రత్యేకంగా అభిషేకాలు జరిపించారు. నారాయణపురంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మహిళలు కొలాటం ప్రదర్శించారు. స్థానిక వీర్ల అంకమ్మతల్లి, వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.

మాచవరం: దేవి శరన్నవరాత్రుల భాగంగా మండల కేంద్రమైన మాచవరం వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపం, భ్రమరాంబిక సమేత చిన్ను మల్లేశ్వర స్వామి దేవాలయం, మండలంలోని చెన్నాయపాలెంలోని రేణుక అమ్మవారి దేవాలయం , మొర్జంపాడులోని బుగ్గ మల్లేశ్వర స్వామి దేవాలయం అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.

వెల్దుర్తి: దసరా ఉత్సవాల్లో భాగంగా శిరిగిరిపాడుకు చెందిన ఎం.యలమంద దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెల్దుర్తి, ఉప్పలపాడు గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేయటంతో పాటు బతుకమ్మలను ఏర్పాటు చేసి ఉత్సవాలను జరుపుతున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు.

పిడుగురాళ్ల: పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని గంగమ్మ తల్లి దేవస్థానంలో కుంకుమ పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గజేంద్రుడిపై అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. పట్టణంలోని భవానీ నగర్‌లోని కనక దుర్గమ్మను దుర్గాదేవిగా భక్తలకు దర్శనమిచ్చారు.

కారెంపూడిలో...

కారెంపూడి: దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి మంగళవారం సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు దిలీప్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయం, లక్ష్మీ చెన్నకేశవ దేవాలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



నారాయణపురం వైఎస్సార్ సెంటర్‌లో కొలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



దాచేపల్లిలో కన్యకపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజలు చేస్తున్న మహిళ భక్తులు



పిడుగురాళ్ల... గంగమ్మ తల్లి దేవాలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బ్రహ్మంగారి దేవాలయం వద్ద కుంకుమ పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దాచేపల్లి రోడ్డులో అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

క్రైస్తవుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నరసరావుపేట: చర్చిలు, పాస్టర్లు, క్రైస్తవుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ప్రముఖ సామాజికవేత్త, ఆలిండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ గొల్లమూడి రాజాసుందర్‌బాబు కోరారు. మంగళవారం పట్టణంలోని వెస్ట్ పారిస్ లూథరన్ చర్చి నుంచి కలెక్టరేట్ వరకు క్రైస్తవ సంఘాలైన యూపీఎఫ్ఎస్, రొంపిచర్ల మండల పాస్టర్ల ఫెలోషిప్, లూథరన్ చర్చి, ఆర్‌సీఎం చర్చిల ఆధ్వర్యంలో క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. తొలుత వెస్ట్ ప్యారిస్ చర్చి కమ్యూనిటీ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సభకు పాస్టర్ రెవరెండ్ పి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ గొల్లమూడి మాట్లాడుతూ మతమార్పిడి వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి పాస్టర్లను జైలుపాలు చేసి కనీసం బెయిల్ కూడా లేకుండా ఇబ్బంది పెడుతున్న విధానం మత స్వేచ్ఛకు విరుద్ధమన్నారు. షాలోమ్ చర్చి వ్యవస్థాపకులు రెవరెండ్ సుధీర్‌కుమార్, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు ఆర్చిరావు మాట్లాడుతూ, క్రైస్తవుల పరిరక్షణ కోసం ఒక క్రైస్తవ అత్యాచార చట్టాన్ని రూపొందించడం సమంజసమని పేర్కొన్నారు. పాస్టర్లు రత్నకుమార్, తిమోతి, జీవరత్నం, ఏసుపాదం, వీరారెడ్డి పాల్గొని ప్రసంగించారు.

సూపర్ జీఎస్‌టీతో ధరలు తగ్గుదల



నరసరావుపేట: సూపర్ జీఎస్‌టీ–సూపర్ సేవింగ్స్ నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్సన్ సోమవారం నరసరావుపేటలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పట్టణంలోని కాసు సెంట్రల్ మాల్‌లోని పలు షోరూంలను ఆయన సందర్శించి ధరలు తగ్గించి అమ్ముతున్నారో లేదో తెలుసుకున్నారు. అలాగే కొనుగోలుదారులతో మాట్లాడి ప్రభుత్వం తగ్గించిన వస్తువుల రేట్ల పట్ల వారి స్పందనను తెలుసుకున్నారు. తరువాత స్వాతిమాల్ షోరూంని సందర్శించి ధరలపై ఆరా తీశారు. అక్కడ కూడా కొనుగోలుదారులతో మాట్లాడారు. అనంతరం నరసరావుపేట చాంబర్ అఫ్ కామర్స్ ప్రతినిధులతో సమావేశమై సూపర్ జీఎస్‌టీ వేడుకలు విజయవంతంగా నిర్వహించడానికి వారి సహకారాన్ని కోరారు. తర్వాత స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సూపర్ జీఎస్‌టీ వేడుకల గురించి చర్చించారు. 11వ వార్డులో పర్యటించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు.